## నయా మాల్

# గాలి మంచిదేనా...



**ఇప్పుడంతా** పొల్యూషనే. పీల్చే గాలి కూడా స్వచ్ఛంగా దొరకడం కష్టంగా మారింది. అలాగని మరీ విషపూరిత వాతావరణంలో బతకడం కూడా మంచిది కాదు. అందుకే మన పరిసరాల్లో గాలి నాణ్యత తెలుసుకోవడం చాలా అవసరం. అందుకు పనికొచ్చేలా ఐకియా సంస్థ 'విండ్ స్ట్రిగ్' అనే పరికరాన్ని తయారుచేసింది. ఇందులోని స్మార్ట్ సెన్సర్ గాలిలోని అతి చిన్న కాలుష్య కణాలనూ గుర్తించగలదు. అలాగే తేమ, ఉష్ణోగ్రతలూ కచ్చితంగా లెక్కిస్తుంది. ఇంట్లో ఉండే ఫంగై, దుమ్ము కణాలు, వంటల వల్ల ఏర్పడే ఆవిరి లాంటివీ అంచనా వేస్తుంది. పీఎం 2.5 పార్టికల్స్ అనేవి శ్వాసద్వారా మనం పీల్చుకునేంత చిన్నగా ఉంటాయి. బయటి గాలితో పాటు వంటలు, స్ప్రేలలాంటి వాటి వల్ల కూడా ఇంట్లో చేరతాయి. వాటిని కూడా అంచనా వేసి చెబుతుంది. అవి ఎక్కువగా ఉంటే ఆ గదిలోని గాలి ప్రసరణను సరిచేయాల్సి ఉంటుంది. చేయంత సైజులో ఉండే ఈ పరికరాన్ని హాలు, బెడ్ రూమ్, లివింగ్ రూమ్... ఇలా ఎక్కడికి కావాలంటే అక్కడికి తీసుకెళ్లొచ్చు. చార్జింగ్ పెట్టుకుని వాడుకోగలిగే దీన్ని time.ikea.comలో అమ్ముతున్నారు. ధర రూ. 3,990.





# పూల ప్యాంటు.. లక్ష రూపాయల్!

'**పీచు మిఠాయి** అర్ధ రూపాయ్. నువ్వు కొరికి ఇస్తే దాని విలువ కోటి రూపాయలు' అంటాడు ప్రేమకవి. పూల ప్యాంటు వెయ్యి రూపాయల్... బ్రాండు చేసిస్తే దాని విలువ లక్ష రూపాయల్'.. అని పాడుకోవాలేమో మనం. ఎందుకంటే ఇక్కడ కనిపిస్తున్న ప్యాంటు ధర కూడా అంతే. దీన్ని ఇటాలియన్ లగ్జరీ ఫ్యాషన్ హౌస్ డాల్చే అండ్ గబానా తయారు చేసింది మరి. కాటన్-పాప్లీన్ వస్త్రంతో చేసిన ఈ స్ట్రెయిట్ లెగ్ ప్యాంటు మీద పసుపు పచ్చ గులాబీలను ప్రింట్ చేశారు. నడుము దగ్గర కుచ్చులు వచ్చిన ఈ ప్యాంట్ టక్ చేయగలిగే ఏ టాప్‌తో అయినా నప్పుతుంది. net-a-porter.comలో దీన్ని అమ్ముతున్నారు.

# యెల్లో టైమ్

**వాచీలంటే** నీలమో, నలుపో, మహా అయితే బంగారు వెండి రంగులో ఉంటాయి. కానీ గడప పచ్చ వన్నె కనిపించడం అరుదు. వందేండ్ల జపాన్ వాచీల సంస్థ సిటిజెన్ సుయోసా తనదైన ముద్రతో పసుపు వన్నె డయల్‌తో సరికొత్త స్పోర్ట్స్ వాచీని తయారు చేసింది. మసక చీకట్లోనూ సమయాన్ని సరిగ్గా చూడగలిగేలా కాంట్రాస్ట్ కలర్ ముళ్లు ఏర్పాటుచేసింది. వాటికి రేడియం కోట్ వేసింది. తేదీని చూపించే చోట ఉంచిన సఫైర్ క్రిస్టల్ సంఖ్యను పెద్దగా కనిపించేలా చేస్తుంది. ఈ ఆటోమేటిక్ వాచీ ఎలా పనిచేస్తుందో చూసేందుకు వెనకవైపు గాజు అద్దాన్ని అమర్చారు. మొత్తానికి విభిన్నమైన లుక్ కోరుకునే వారికి పసుపు డయల్ పరమాన్నంలా రుచిస్తుంది. watches.co.inలో ఆర్డర్ చేయవచ్చు. ధర సుమారు రూ. 35 వేలు.






# కథలు దగ్గరగా... తెరలు దూరంగా...

**ఇప్పుడు** చిన్నపిల్లలు కూడా గ్యాడ్జెట్లు వాడుతున్నారు. స్మార్ట్‌ఫోన్, టాబ్లెట్ వాళ్లకూ వినోద మార్గాలు అయ్యాయి. కానీ ఇవి పిల్లల వికాసానికి ఉపయోగపడకపోగా, కళ్ల జబ్బుల్లాంటి అదనపు ఇబ్బందులను తెచ్చిపెడుతున్నాయి. మానసికంగానూ వాళ్లను ఎదగనివ్వడంలేదు. అలా కాకుండా, పిల్లలు సరదాగా కథలు వినేలా, రకరకాల యాక్టివిటీలు చేసుకునేలా సాయపడతాయి వాబల్ ఆడియో బుక్స్. హెడ్‌ఫోన్‌తో పాటు యాక్టివిటీ పుస్తకాలు ఉంటాయి ఈ కిట్‌లో. స్మార్ట్‌ఫోన్ ద్వారా హెడ్‌ఫోన్‌కి కనెక్ట్ అయిపోయి పిల్లలకు రకరకాల కథలు వినిపించొచ్చు. వాళ్ల సృజనాత్మకత పెంచే పనులు చేయించవచ్చు. అనేక పాటలు, నైపుణ్యాలను పెంచే పాఠాలు కూడా ఉంటాయి. ధర రూ.3500. vobble.fun ద్వారా కొనుక్కోవచ్చు.

